# పులి! - పిల్లి!

హాస్య కథలు రాయటంలో దిట్ట అవధాని! పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాలంటే అవధాని రాసే కథలు చదవాల్సిందే సీరియస్ కథలు రాయనే రాయడు! అసలు వాటి జోలికే పోడు! కథ చదివిన పాఠకుల వళ్లు గిలిగింతలు పెట్టినట్టుండి నేల మీద పడి పొర్లిగింతలు పెట్టాల్సిందే!

పత్రికలు నిర్వహించే హాస్యకథ పోటీలకు ప్రేరణ ఇతగాడే! ఒకనాడు పత్రికలు హాస్య కథల పోటీలు నిర్వహించటం పాఠకులు ఎరగరు!

అవధాని పుట్టి కలం చేత పట్టాగానే హాస్య కథలు మార్కెట్లోకొచ్చినయ్. సినీమాల్లోనూ కామెడీకి పెద్దపీట ఇటీవలే వేయటం జరిగింది. హాస్య నటుల సంఖ్య సైతం పెరిగింది. హీరో... విలన్... కేరక్టర్ యాక్టర్ అనే బేధ భావం మరిచి అన్ని పాత్రలూ కామెడీ పండిస్తున్నయ్.

కానీ... కథల విషయానికొస్తే హాస్య కథలు రాసేవారిని వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు! ఇలాంటి కథలు రాసే వారిసంఖ్య పెరుగుతోంది.!

అవధానికి 'హాస్యబ్రహ్మ' అనే బిరుదు పాఠకులంతా ఏకమై పెద్ద ఎత్తున ఘన సన్మానం చేసి ప్రదానం చేయటం హాస్య కథా రచనలో ఇతనికే దక్కింది.

ఇక హాస్య కథల పోటీ విషయానికొస్తే అవధానిది రిజర్వుడు సీటు! ఏ పత్రిక. పోటీలోనైనా ఫస్ట్ ప్రైజుని వశం చేసుకుంటాడు! హిట్స్ మీద హిట్స్ కొట్టి సెంచరీ సాధించిన ఘనత అవధానిదే!

బ్యాంకు లోనుతో తన టేస్ట్ ప్రకారం హేపీ హోం కట్టుకున్నాడు. ఆ ఇంట్లో ఓ గదిలో గోడలకు... కస్తూరి శివరావు, పద్మశ్రీ రేలంగి, రమణారెడ్డి, ఛార్లీ ఛాపిన్ వంటి అలనాటి హాస్యనటుల తైల వర్ణ చిత్రాలతో పాటు నేటి కమెడియన్స్ అయిన రాజబాబు, పద్మశ్రీ అల్లు రామలింగయ్య, పద్మశ్రీ బ్రహ్మానందం మొదలుగాగల వారి ఫోటోలూ దర్శనమిస్తయ్! ఎవరైనా ఆ గదిలో అడుగుపెడితే చాలు... వింత అనుభూతికిలోనై నవ్వుకుంటారు.

హాస్యం పట్ల అవధానికి గల 'టేస్ట్' ఎలాంటిదో అర్ధమౌతోంది! అతను రాసే హాస్య రచనలకు ప్రేరణ అలనాటి నేటి హాస్యనటులేనని చెప్పుకుంటాడు!

హాస్యనటులందరూ అతనికి ఆరాధ్యదైవాలు!

హాస్యం జీవితంలో ఒక భాగం కావలనేది అవధాని ఆకాంక్ష! అది ఆరోగ్యానిస్తుందని అవధాని ప్రగాఢ విశ్వాసం! అతన్లో ఓ చిత్రమైన కోరికుంది. వెయ్యి హాస్య కథలు రాసి గిన్నీస్ బుక్‌లోకెక్కాలని! మరో పాతిక హాస్యకథలు వ్రాస్తే అతనే నెంబర్ వన్ అవుతాడు. గిన్నీస్ బుక్కులో చోటు సంపాదిస్తాడు.

ఈమధ్య 'హాస్యకథానిధి'... 'కామెడీ కథల చక్రవర్తి' అనే బిరుదులను అతని ఖాతాలోకొచ్చిపడ్డయ్.

ఓపాతిక తెలుగు హాస్య సినిమాలకు కథ సంభాషణలు చేకూర్చి వెండి తెరకూ ఎగబాకాడు. బుల్లి తెర నిర్మాత దర్శకులు తనను సంభాషణలు రాయమని బ్రతిమాలినా 'నో' చెప్పాడు. అందుక్కారణం రెమ్యూనరేషన్ తన తృప్తి మేరకు లేకపోవటమే!

× × × × ×

సడన్‌గా అప్పారావు అవధాని ఇంట్లోకి ఎంటరైనాడు!

'సిస్టర్!... సిస్టర్!- బావ మహాశయుడెక్కడ? నీ ఎదురుగా కూర్చుని స్టోరీ రాయటానికి భయపడి... అదృశ్య రూపంలో ఏ చెట్టు మీదైనా కూర్చుని కొత్త కథ బరుకుతున్నాడా?... ఈ మధ్య మంత్ర తంత్ర విద్యలు కూడా నేర్చుకున్నాడని కర్ణాకర్ణికగా విన్నాను!...' హాల్లోనే ఎదురైన అవధాని భార్య మంగళను అడిగేడు.

'నీకూ వంటబట్టిందా హాస్య ధోరణి?-'

'రాక చస్తుందా? ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతారనే సామెత వుందిగా... బావ సహచర్యంతో నాకూ కొన్ని తిక్క మాటలు అబ్బినయ్ సిస్టర్!'

'పదినిముషాల క్రితం నీ పెళ్లాం చక్కెర అప్పుకోసం వచ్చింది. మీ ఆవిడకు అప్పులు ఇవ్వలేక చస్తున్నాను. పుచ్చుకోవటమేగాని ఇచ్చుకోవటం లేదు... ఇంకోసారి నా ఇంటి గడపతొక్కితే నీ శ్రీమతి కాళ్లు విరగ్గొడతానని చెప్పు...' మంగళ కనెర్ర చేసింది.

'అలాగే... అలాగే సిస్టర్... ఇంతకూ బావ ఎక్కడో చెప్పనేలేదు...' అప్పారావ్ నీళ్లు నమిలాడు భయంతో వణికిపోతూ.

'దొడ్లో బాదం చెట్టు కిందో... నూతి గట్టు పక్కనో... బాత్‌రూమ్‌లోనో కూర్చుని

కాగితాలు ఖరాబు చేస్తుంటారు. వెళ్లి వెతుక్కో...' చెప్పి కిచన్లోకి నడిచింది మంగళ.

'అంతేనా లేక నూతిదగ్గర అంట్లు బొచ్చులు బావతో తోమిస్తున్నావా సిస్టరూ?-

'ఎకచక్కాలాపవయ్యా! అయినా ఇంట్లో పనులు చేసుకుంటే తప్పేంటి?' కిచన్లోకి వెళ్లబోయి ఆగిమరీ అంది.

'ఏం తప్పులేదు సిస్టర్! నా పెళ్లాం నా చేత ఇల్లు వూడ్పిస్తుంది... బూజు దులిపిస్తుంది. పాచి పని చేయిస్తుంది.. వంట చేయిస్తుంది... అన్నీ నాస్వహస్తాలతో చేస్తేనే దానికి తృప్తి... ఆనందం!-'

ఆం! అట్లారా దారికి! మీ ఆవిడ నీరోగం బాగానే కుదిరిస్తుందన్న మాట! నీ గాలే నీ బావగారికొచ్చింది.

'అది కాదు సిస్టర్! బావ నాలాంటి అ ప్రయోజకుడు కాదు. ప్రఖ్యాత హాస్యకధా రచయిత! సొసైటీలో ఆయనకు ఎంతో అభిమానం గౌరవంవున్నయ్! ఎన్నో సన్మానాలు.. బిరుదులు సొంతం చేసుకున్న సుప్రసిద్ధ రచయిత. అలాంటి మా బావను నువ్వు తక్కువగా చూడటం ఎవరూ హర్షించరు అక్కా!- అయినా నువ్వు ఎవరిమాటావినని మొండిదానివి కదా?- నీకు చెప్పిన ఆగోడకు చెప్పినా వక్కటే..' మనసులో మాట వెళ్ల గక్కిబావ కోసం దొడ్లోకి నడిచాడు.

దొడ్లో బాదం చెట్టు కింద చైర్లో కూర్చుని రచనలో మునిగిపోయిన అవధానిని చూడగానే' ఏదైనా పోటీకి హాస్యకధ వండుతున్నావా బావా...?' చమత్కరించాడు.

'వచ్చావా... రా!... ఇంకా రాలేదేమాని అనుకుంటున్నాను. ఆం! వచ్చిన పని చెప్పి వెంటనే వెళ్లిపో! నన్ను డిస్టర్బ్ చేయకు...' సీరియస్‌గా అన్నాడు అవధాని.

'అప్పారావ్ నీ వద్దకెందుకొస్తాడు? అప్పుకోసం! ఇంత పెద్ద రైటర్‌వి ఆమాత్రం గ్రహించలేవా బావా?-'

'నీ ఎగతాళి మాటలు ఆపు! అప్పుకునేనే దొరికానా?-'

'అవును! యస్సు! వడ్డీ లేకుండా ఇస్తావు కదా? తిరిగి ఇచ్చినా ఇవ్వకపోయినా నన్ను మళ్లీ మళ్లీ రానిచ్చేవాడివి. నువ్వే కదా?... అవునూ... రేపు రవీంద్రభారతిలో నీ హాస్యావధానం వుందిటగా... నాకు చెప్పలేదేం?- నేనూ వచ్చి చప్పట్లు కొట్టేవాడిని! 'అన్ని న్యూస్ పేపర్స్‌లో వచ్చింది. అందరికీ తెలసింది ప్రోగ్రాం గురించి టి.వీల్లో

సైతం టెలికాస్ట్ చేయటం జరిగింది. నీకు బొట్టు కాటుక పెట్టి ప్రత్యేకించి చెప్పలాఏం?-' రాసుకోవటంలో నిమగ్నుడై తలపక్కకి తిప్పి అప్పారావు ముఖంలోకి చూడకుండానే మాట్లాడేడు అవధాని.

'నువ్వు అవధానం ఎప్పుడు నేర్చుకున్నావ్? చిత్రంగా వుందే! మాయలు... మంత్రాలు తంత్రాలు కూడా నేర్చుకున్నావా ఏమిటీ?

'ఆహా! మ్యాజిక్ కూడా అభ్యసించాను. ఇంకా ఏమైనా వివరాలు కావాలా?-'

'కోప్పడకు బావా! ఎంతో అవసరం వుంటే గానీ నీ వద్దకు రాను. నువ్వే కదా నన్నాదుకునేది...'

'అవునూ... నువ్వు రాస్తుందేంటి? కథేనా?-'

'కాదు లవ్ లెటర్...'

'ఈ వయసులో నీకిదేం పోయేకాలం? అక్కకు తెలిస్తే చీపురు తిరగేస్తుంది. నీకు ఇంట్లో పుడ్డుండదు- అక్క సంగతి తెలిసీ నువ్వింతటి సాహసానికి పూనుకో తగునా?-' ముక్కున వేలేసుకున్నాడు అప్పారావు.

'లవ్‌కు వయసులో పనేముంది? కళాకారులు... విద్వాంసులు అనేకులు... వయసు మీరి వృద్ధాప్యం మీదపడ్డాకే లవ్‌లోపడి కుర్రపిల్లలను చేసుకున్న వాస్తవాలెన్నో వున్నయ్. లవ్ చేయటం కుర్రాళ్లకే కాదు ముసలాళ్లకూ తెలుసు. దానికి వయోబేధం లేదు.'

'మా సిస్టర్ రాక్షసని తెల్సీ ఇంత సాహసానికి వొడి కడుతున్నావంటే నాకు ఆశ్చర్యంగా వుంది...'

'సర్లే. అధిక ప్రసంగం ఆపి నువ్వొచ్చిన పని చెప్పు...'

'ఏముందీ... అర్జంట్‌గా ఓ వందకొట్టు బావా...'

'నెలకెన్ని వారాలు అప్పారావ్?-'

'ఓన్లీ ఫోర్ అందరికీ తెల్సిందేగా'

'కాదు. నీ విషయంలో తప్పు! నీ మటుక్కు నెలకి వారాలు మున్నూట అరవై అయిదు! ఎందుకో చెప్పనా? నెలకు అన్నిసార్లు నావద్దకి అప్పుకోసం వస్తావు కనుక!...'

'చాల్లే ఆపు బావా పరాచికాలు!. ఏదో బీదవాడిని! ఆదాయం లేనివాడిని. అరడజను మంది ఆడపిల్లల తండ్రిని! నువ్వు కాకపోతే నన్నాదుకునే వారెవరున్నారని...'

'చదువులేదు సరికదా.. చిన్ననాడే పురోహిత్యమైనా నేర్చుకుని వుంటే... ఈ పాటికి బోలెడంత క్యాషు... నీ భార్యా పిల్లలకు వంటినిండా బంగారు నగలు వుండేవి కదా.. ఇప్పటికైనా మునిగిపోయింది లేదు... ఏ చిల్లర దుకాణంలోనైనా నాగుమాస్తాగా చేర్పిస్తాను నువ్వు చేస్తానంటే... మూడు నాలుగువేలు నెలనెలా జీతం వస్తుంది ఏమంటావ్...'

'నీ అప్పంతా పెదరావూరి ఖాతాలో రాసుకోవద్దులే బావా... నా పెద్ద కూతురు చదవి వుద్యోగం చేస్తుందిలే! మొదటి జీతం రాగానే నీ బాకీ అణాపైసలతో తీర్చేస్తాన్లే... నువ్వేందిగులు పడద్దు...'

'హు! దానికిప్పుడు పదిహేనేళ్లు! టెన్త్ చదువుతోంది. అది ఇంటరై... డిగ్రీ అయి... వుద్యోగం వచ్చే నాటికి నేనుంటానో 'హరీ' అంటానో...'

'అవేం అపశకునపు మాటలు బావా? నీకు ఆయుర్దాయం వెయ్యేళ్లు!...'

ఇక అప్పారావ్‌తో వాగటం అనవసరమన్పించి జేబులోంచి వంద తీసిచ్చాడు అవధాని.

నోటు కళ్లకద్దుకుని 'థ్యాంక్యు బావా' అనేసి ఎగురుకుంటూ వెళ్లి పోయాడు అప్పారావు.

× × × × ×

'దానంలో మీరు కర్ణుడిని మించిపోతున్నారు. ఇట్లా అయితే కొంపగుండమే... అప్పారావుకి మీరు అడిగినప్పుడల్లా అప్పివ్వటం చేస్తుంటే నావళ్లు మండుతోంది...' అవధాని మీద కేకలేసింది పెళ్లాం.

'మీ తమ్ముడే కదే వాడు..'

'ఏం? పరిహాసమా?- నన్ను చూడండి పిల్లి క్కూడా బిచ్చం పెట్టను. తమ్ముడు గాని తాళికట్టిన పెళ్లాంగానీ కొన్ని విషయాల్లో స్ట్రిక్ట్‌గ వుండకపోతే నెత్తికి చెంగే...'

'సరేలేవే ఆపునీ సోది! అవునూ పని మనిషి మాటేంచేశావ్?... ఎవరైనా కుదిరారా?.. ఇంట్లో చాకిరీ చేయలేక నాచావు కొస్తున్నది. నువ్వేమో ఇటు చీపురు

పుల్ల తీసి అటు పెట్టవ్! వంటింటి జోలికి వెళ్లవ్! అంట్ల బొచ్చలు తోమటం దగ్గర్నుంచి ఇల్లు చిమ్మటం... బట్టలు(నీవి, నావీను) వుతకటం.. కక్కసు దొడ్డి క్లీన్ చేయటం దాకా నేనేనాయె?- ఇట్లా అయితే ఎట్లా చెప్పు! నాకేమో పెద్ద రైటర్ గాడినని బైట పేరు... గౌరవం... ప్రతిష్ఠ! సన్మానాలు... సత్కారాలు ఎట్సెట్రా! ఇంట్లో చూడబోతే పనిమనిషి... వంటమనిషిని నేనేనాయె?- ఎన్నాళ్లని ఇట్లా? నాలో ఓపిక నశిస్తోంది! రాసుకు చావటానికి టైందొరికేడవటం లేదే...' మరోసారి అష్టోత్రం చదివాడు అవధాని.

'అవునండీ... పెళ్లి అయిన పదేళ్ల దాకా పెళ్లాం పట్టకుండా రాత్రింబవళ్లు కథలు రాస్తూండిపోయారు. వంటరి దాన్ని అయిన నన్ను ఇంట్లో పలుకరించే దిక్కు లేక నానా అవస్థలు పడ్డాను. అందుకే మీ తిక్కకుదర్చాలనే నేను వంటింటి జోలికేపోవటం మానేశాను. నన్నేనాడైనా లాలించారా... పాలించారా?... అక్కున చేర్చుకుని ముద్దూ ముచ్చట తీర్చారా?- నాసరదాలన్నీ బూడిదలో పోసిన పన్నీరైనయ్...'

'చూడూ! తాళికట్టిన వాడిని నౌకరుకంటే హీనంగ చూడటం మహాపాపమే! ఇది పతివ్రత లక్షణం కాదే!- భర్తను రాచిరంపాన పెట్టినవారు రౌరవాది నరకాల పాలవుతారే. అది తెలీకే ఇలా ప్రవర్తిస్తున్నావ్...' దీనంగ మోహంపెట్టాడు అవధాని.

'చాల్లే ఆపండిమీ పురాణం!...'

'అయ్యో మొగుడే... పేరు ప్రఖ్యాతులున్న వాడే... తాళి కట్టినవాడిననే జాలి కూడా లేదు నీకు. అదేమంటే నా చేత గుంజీలు తీయిస్తావ్... గోడకుర్చీ వేయిస్తావ్... అప్పడాల కర్రతో మాడు పగలకొడతావ్... తొడపాశం పెడతావ్... నేను కుయ్యోమొర్రోని గుక్క తిప్పకుండా ఏడిస్తే నువ్వు పకపకా నవ్వుతావ్. నీకు వున్నవన్నీ రాక్షస జాతి స్త్రీ లక్షణాలే!...'

'నా కడుపు పండి ఒక్క ఆడపిల్లయినా పుట్టివుంటే నీకునాకు ఈ ఇబ్బందులు తప్పేవి! అందుకూ నోచుకోకపోతిని!...'

ఇంతోటి మహాతల్లికి సంతానం కూడానా? అందుకే ఆ దేవుడు లేకుండా చేసి రోగం బాగా కుదిర్చాడు అనేసి మనసులో సంబరపడ్డాడు అవధాని.

'కుక్కర్ పొయ్యి మీదుంచి నువ్వెళ్లి నీదోవన నువ్వు రాసుకుంటూ కూర్చున్నావ్!- ఓవంద విజిల్స్ వచ్చింటయ్. కుక్కర్లో అన్నం మాడి మశానమై

వుంటుంది. ఓ కథా రచయిత గారూ... ఎక్కడ తగలపడ్డాదు?...' విషయం గుర్తొచ్చి అంది.

'అబ్బబ్బా... వస్తున్నానే! నన్ను చెండుకు తింటున్నావ్. కూర్చో నీవు... నిల్చోనీవు! నాలుగు విజిల్స్ వచ్చాక స్టౌ కట్టేయటానిక్కూడా నీకు వళ్లాంగదా?-'

'ఈ కొంపలోనే చిన్న మెత్తు పని చేయనని నీకు ఏనాడో చెప్పాను. ప్రతిసారీ గొంతు చించుకోవటం నా వల్ల కాదు... నామీద విరుచుపడతావేం' అనేసి అవధానాని వంగోబెట్టి వీపు మీధ పిడిగుద్దులు గుద్దింది.

హాస్యం, రాసే కథలకేనే పరిమితం! వాస్తవానికి నాబతుకంతా ఏడుపే ... అందుకే కాబోలు విచారంలో నుండే హాస్యం పుట్టుకొస్తుందంటారు- ఏం చేస్తాం? ఇంట్లో పిల్లి... వీధిలో పులి బ్రతుకైంది...' వగర్చాడు అవధాని.

(సమాప్తం)